# నీ-నా. మన.. (కథ)

-కె. తాయారమ్మ

"నేను కాపురానికొచ్చి సరిగ్గా నలభై యేళ్లయింది. ఓ అచ్చటా లేదు, ముచ్చటా లేదు. పుణ్యంలేదు, పురుషార్థం లేదు. గోదారి పుష్కరాలొచ్చాయి, కృష్ణా పుష్కరాలొచ్చాయి. సముద్ర స్నానాలొచ్చాయి. దేనికైనా ప్రాప్తం ఉండాలి. చిన్నప్పుడల్లా నువ్వు చిన్న పిల్లవి, నీకివన్నీ ఎందుకన్నారు? పెళ్లయ్యాక కొత్త కోడలివి పో అన్నారు. పిల్లలు పుట్టేక సరేసరి. బాధ్యతలూ బరువులూ. ఇంక ఈ ముసలి వయసులో ఎటుపోగలను? అంటూ మాట మాట ఏకరువు పెట్టసాగింది చెంచమ్మ బియ్యంలో రాళ్లేరుతూ.

"నీది ముసలి వయసేమిటోయ్. మరి బియ్యంలో రాళ్లెలా ఏరుతున్నావు?" అన్నారు అక్కడికి దగ్గరలోనే వాలు కుర్చీలో కూర్చుని భాగవతం చదువుకుంటున్న వైకుంఠమూర్తిగారు.

భర్తవైపు చురచురా చూసింది చెంచమ్మ.

"మీకింకా వేళాకోళమే. ఆ మధ్య కళ్లాపరేషన్ చేయించాడుగా కొడుకు. అది బియ్యంలో రాళ్లేరడానికి పనికొచ్చింది" అంది కినుకగా.

భార్య వైఖరి గమనించిన వైకుంఠమూర్తి-

"నువ్వనేదేమిటో కాస్త సూటిగా చెప్పవోయ్."

"మరో నెలలో కృష్ణా పుష్కరాలొస్తున్నాయి. ఎదురింటి సుందరమ్మ, పక్కింటి కోమలవల్లి, ఇంకా ఈ వీధిలో చాలామంది వెళ్తారట కృష్ణా పుష్కరాలకి."

అప్పుడే అటువైపు వచ్చిన కోడలు గోమతి గయ్‌మంది. "కూనా గువ్వా కూటికేడిస్తే, అవ్వ యింక దేనికో ఏడ్చిందట!' అలా ఉంది మీ వరుస. పిల్లల చదువులు, బాధలూ.. వీటితో మేము సతమతమైపోతూ వుంటే, మీరేమో పుష్కరాలకెళ్తారా? పుష్కరాలకి!"

కోడలి సంగతి బాగా తెలిసినా మళ్లీ అంది చెంచమ్మ. చూడు గోమతీ! మనిషిగా పుట్టాక ఏదో ఒక పవిత్రమైన కార్యం ఆచరించాలి. ఇలాంటి సమయాలలో నదిలో స్నానం చేస్తే పాపాలన్నీ నశిస్తాయట. మనం పుణ్యలోకాలకి పోతామట. ఈ ఒక్క కోర్కె తీర్చు తల్లీ. ఇక జన్మలో నిన్ను ఏమీ కోరను" కన్నులలో తడి మెరుస్తుండగా అంది చెంచమ్మ.

చాల్లెండి సంబడం! ఈ ప్రయాణాలలో ఏ కాలో చెయ్యో విరిగిందంటే ఆ బాధ కూడా మేమే పడాలి. పైగా ఇలాంటి వాటికి డబ్బెలా వస్తుంది? హాయిగా తిని కూర్చోక ఉప్పన్న బుద్ధులు పుడుతున్నాయేం మీకు?"

"మీ మామగారి పెన్షన్ వస్తుందిగా. ఈ నెల దానిని ఇంట్లో ఖర్చు చెయ్యకు. మేం పుష్కరాలకి వెళ్తాం" దృఢంగా వచ్చింది చెంచమ్మ నుంచి ఆ మాట.

"ఎంత ధైర్యం మీకు! మీ పెన్షన్ డబ్బులు మేము తినేస్తున్నామనేగా మీ బాధ. మీ మందులకి, మీ అవసరాలకే ఖర్చుపెడుతున్నాం. ఇంకా పెన్షన్ డబ్బులు ఎక్కడ మిగులుతాయి? ఇంతకీ ఆయన గారిని అనాలి. వాళ్లని ఆ పల్లెటూర్లోనే పడి వుండనివ్వండి, మనకెందుకీ సంత అంటే వినిపించుకున్నారూ? ఇదంతా నా తలరాత. ఎంత చేసినా మాటా మాణిక్యం దక్కదు" అంటూ రుసరుసలాడింది గోమతి.

"ఇంతకీ ఈమెకి ఈ పేరు ఎవరు పెట్టారో? ఏ ఎర్ర తేలనో, కండచీమనో పెట్టుండాల్సింది" తనలో తానే గొణుక్కున్నట్టు అన్నాడు వైకుంఠమూర్తి.

"ఏమిటి గొణుగుతున్నారు?" అంది గోమతి రివ్వున లోపలికెళ్తూ.

"అయినా నా చాదస్తం కాని ఇన్నేళ్ల తరువాత నా కోరికని ఇలా బయటపెట్టడం దేనికి?" అనుకుంటూ వంటింట్లోకి నడిచింది చెంచమ్మ.

ఆ రాత్రి ఆమెకు ఎంతకీ నిద్ర రాలేదు. గతం-వర్తమానాల మధ్య కొట్టుమిట్టాడుతోంది అంతరంగం.

తనకి అప్పుడు పదేళ్లు. గోదారి పుష్కరాలొచ్చాయి. ఎప్పుడో తను పుట్టక ముందు వచ్చేయట. అమ్మ, నాన్న, నాన్నమ్మ, ఇంకా ఇంట్లో అందరూ నదీ స్నానాల కెళ్లారు. ఆ ఊళ్లో ఇంకా చాలా మంది వెళ్లారు. గోదారి ఎంత బావుంటుందో. తరువాత మరి మాటలు వినపడ లేదు. కోడలి ఏడుపు మాత్రం చాలాసేపు వినిపిస్తూనే ఉంది.

తన కోరిక తీరదు అనుకుంటూ నిద్రలోకి దూరిపోయింది చెంచమ్మ.

○ ○ ○

ఆ రోజు ఆదివారం. వంటా వార్పూ చేసుకుని ఇవతలకొచ్చి వీధి వసారాలో కూచుంది చెంచమ్మ. భర్త, కొడుకు, కోడలు, మనుమలు అందరూ భోజనాలు

చేసిన తరువాత తను భోంచేస్తుంది. ఈ ఇంటి కొచ్చిన దగ్గర నుంచీ ఇలాగే సాగుతోంది. వీళ్లకి వంట మనిషి బాధ, పనిమనిషి బాధ కూడా తప్పింది. అయినా రోజుకోసారైనా తమని అనవసరంగా ఇంట్లో పెట్టు కున్నట్టు అరుస్తూ ఉంటుంది.

వర్ధన్ సర్దిచెబుతూ ఉంటాడు కూడా.

"పిన్నిగారూ, మీరు కృష్ణా పుష్కరాల కెళ్తున్నారా?" ఆ వీధి చివర ఉండే జగదాంబగారి కోడలు అడిగింది.

తనేం సమాధానం చెబుతుంది? "ఇంకా ఏమీ అనుకోలేదు లోకేశ్వరీ..." అంటూ తప్పించుకుంది.

ఇంతలో వర్ధన్ ఇవతల కొచ్చాడు. భగవద్గీతా పారాయణం ముగించుకుని వైకుంఠమూర్తిగారు కూడా ఇవతలకొచ్చి కుర్చీలో కూర్చున్నారు.

కిందకి కాళ్లు పెట్టుకుని కొంచెం ఎత్తు గట్టుమీద కూర్చుంది చెంచమ్మ.

"అమ్మా కాళ్ల నొప్పులా?" అన్నాడు తల్లి కాళ్ల మీద చేతులు వేస్తూ వర్ధన్.

దుఃఖం తన్నుకొచ్చింది చెంచమ్మకి.

"ఫరవాలేదు నాయనా, ఈ వయస్సులో ఈ కాళ్ల నొప్పులు సహజమే" అంది.

"అమ్మా, నువ్వు యాత్రలకి, పుష్కరాలకి వెళ్తే కొంచెం దూరమైనా నడవగలవా?"

ఆమె కళ్లలోకి వెలుగొచ్చింది. "సమయాన్ని బట్టి శక్తి అదే వస్తుంది బాబూ. తొంభై ఏళ్ల తొక్కులు కూడా వెళ్తున్నారు పుష్కర స్నానాలకి."

"అవున్రా వర్ధన్. మీ అమ్మ ఈ చిన్ని కోరిక తీర్చలేకపోయాను నేను. కొడుకుగా నువ్వయినా తీరిస్తే సంతోషంగా ఉంటుంది" అన్నారు వైకుంఠమూర్తిగారు.

"నేనూ అదే ఆలోచిస్తున్నారు నాన్నగారూ" అంటూ భార్య భోజనానికి పిలవడంతో లోపలికి నడిచాడు వర్ధన్.

"పుత్రుడు - పున్నామ నరకం నుంచి తప్పించు వాడు" అనుకుంటూ కొడుకు వెనకాలే లోపలికి నడిచాడు వైకుంఠమూర్తిగారు.

ఆ ఇద్దరినీ చూస్తూ తృప్తిగా నవ్వుకుంది చెంచమ్మ.

❍ ❍ ❍

ఆ రోజు రాత్రి వీధి వసారాలో పక్కలు పరుచుకుని పడుకున్నారు చెంచమ్మ, వైకుంఠమూర్తిగారు. ఇన్నాళ్లకి తన కోరిక తీరబోతోందన్న ఆనందం ఆమెని నిలవ నియ్యడంలేదు. "ఏమండీ, నిజంగా వర్ధన్ మనల్ని పుష్కరాలకి తీసుకెళ్తాడంటారా?" ధర్మసందేహాన్ని వెలి బుచ్చింది చెంచమ్మ.

"వాడదేగా అన్నాడు. ఇంక అతగాడి భార్యామణి గారేమంటారో? అయినా ఆందోళన ఎందుకు? ఎలా జరగాలో అలా జరుగుతుంది. బాగా రాత్రయింది, నిద్రపో" అన్నారు వైకుంఠమూర్తిగారు గట్టిగా ఆవు లిస్తూ.

తనూ నిద్ర కుపక్రమించింది చెంచమ్మ.

అదే సమయంలో లోపల గదిలో వర్ధన్‌తో అం టోంది కోడలు గోమతి. "నిజంగా ఆ ముసలాళ్లని పుష్కరాలకి తీసుకెళ్తున్నారా?"

"తీసుకెళ్లాలనే అనుకుంటున్నాను."

"అయితే నన్ను ముందు నా పుట్టింటికి పంపె య్యండి. మరి నేను తిరిగి వచ్చేది లేదు. పైగా నా తల్లిదండ్రులకి నేను ముద్దుల కూతుర్ని. వాళ్లు నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు. ఇంక ఈ ఇంట్లో

## నైరాశ్యం

మెరుగులు చిమ్మే తారకలన్ని
మానస సరోవరం నుండి
విశ్వానికి నిండు ప్రభలందిస్తుంటే
చీకట్లో తిరిగే గబ్బిలం
పట్ట పగలే
పుట్టెడు పురుగులేరుకుంటుంది
ఆశకు దీక్ష తోడై
నిశిత కౌశలం ఓషధినందిస్తుంటే
మరయే మనిషిగ మారి
అంతర్జాతీయంగా
ఔన్నత్యాన్ని సాధిస్తుంది
పరిశోధనా పాటవం
విజ్ఞాన వినోదంతో
గ్రహాలపై గృహాలు నిర్మించే
నూతన పథకాలు ఉత్పన్నమౌతున్నా
రుధిరం పారని పేద హృదయం
గోడల దృఢత్వం లేక
శీతావాతాతప శస్త్రాలతో
ఛిద్రమౌతూనే వుంది
వాడిన బ్రతుకుల్లో
వసంతానికి స్థానం లేక
శిశిరానికే స్థిరత్వమేర్పడుతుంది.

-వూట్ల భద్రయ్య

నేనో, మీ తల్లిదండ్రులో ఎవరో ఒకరు వుండాలి" దృఢంగా వచ్చాయి గోమతి గొంతు నుంచి ఆ మాటలు.

"సరే" అంటూ గోమతి చెవిలో ఏదో రహస్యం చెప్పాడు వర్ధన్.

గోమతి ముఖం వికసించింది. "నిజం?" అంది ఆనందం పట్టలేక.

"ఒట్టు!" అంటూ ఆమె చేతిలో చెయ్యి వేశాడు వర్ధన్.

మరునాడు ప్రొద్దున్నే "అత్తయ్యగారూ, మామయ్య గారూ- మీ అబ్బాయి మిమ్మల్ని పుష్కరాలకి తీసుకెళ్తా నంటున్నారు. ప్రయాణానికి అన్నీ సర్దుకోండి" అంది గోమతి.

ఈసారి ఆశ్చర్యపోవడం వైకుంఠమూర్తిగారి వంతయింది. చెంచమ్మ పొంగిపోతోంది కోడలిలోని ఈ మార్పుకి.

"అన్నట్టు మర్చిపోయాను చెప్పడం. మీ అబ్బాయి నా బంగారు గాజులు తాకట్టు పెట్టడానికెళ్లారు. మీరు వెళ్లేక ఏ ఇబ్బందీ పడకూడదు ఖర్చులకి."

"ఎందుకమ్మా దండగ. మేం ఇప్పుడు వెళ్లకపోతే నేం. నీ పుట్టింటివాళ్లు పెట్టిన బంగారు గాజులు మా గురించి ఖర్చుచెయ్యడం దేనికి?" అన్నారు వైకుంఠ మూర్తిగారు.

"ఫరవాలేదు మామయ్యగారూ. నేనేం పనికి మాలిన దానికి ఖర్చు చెయ్యడంలేదుగా. ఓ పవిత్ర కార్యానికి ఖర్చుచేస్తున్నాను" అంది.

"గోమతీ నువ్వు సార్థక నామధేయురాలివి" అనుకున్నారు వైకుంఠమూర్తిగారు.

తరువాత అత్తమామల్ని, భర్తని రైలెక్కించి వచ్చి నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంది గోమతి.

○ ○ ○

వారం రోజుల తరువాత ఒక్కడే తిరిగి వచ్చాడు వర్ధన్. అతను మామూలుగా రాలేదు. గుండు చేయిం చుకు వచ్చాడు.

"అతన్ని వీధిలోనే చూసి ఏమిటండీ ఇది. అత్తయ్య, మామయ్యా ఏరీ? ఈ గుండు ఏమిటీ?" అమాయ కత్వం నటిస్తూ ప్రశ్నించింది గోమతి.

"అమ్మా, నాన్నా కృష్ణలో మునిగిపోయారు. ఎంత వెతికించినా ప్రయోజనం లేకపోయింది" అంటూ బావురుమన్నాడు వర్ధన్.

"అయ్యో ఎంత పని జరిగింది? పోనీ పెద్దవాళ్లు సరదా పడుతున్నారు కదాని నా బంగారు గాజులు తాకట్టు పెట్టి వాళ్లని పుష్కరాలకు పంపించాను. ఇలాంటి ఘోరం జరిగింది. వాళ్లని పంపించకపోయినా బాగుండేది. కోడలు రాక్షసి అనుకుంటే అనుకోనీ లోకం. అయ్యో అత్తయ్యా, మామయ్యా. మమ్మల్ని వదిలిపోయారా?" అంటూ వయినాలు పెట్టసాగింది గోమతి.

"ఊరుకో గోమతీ, ఏం చేస్తాం. పెద్దవాళ్లు వుండి మనల్ని మంచి మాటాడే యోగం లేదు మనకి" అంటూ భార్యని ఓదార్చాడు వర్ధన్.

ఈ గొడవకి ఇరుగు పొరుగులు వచ్చారు. సంగతి తెలిసి "అదృష్టవంతులు. పుష్కర స్నానాలకెళ్లి తనువు చాలించారు" అంటూ ఓదార్చారు.

అన్నిటికీ మౌనమే సమాధానమయింది వర్ధన్‌కి. తల వంచుకు కూర్చున్నాడు. కానీ గోమతి మాత్రం అత్త మామల మంచితనాన్ని గోరంతలు కొండంతలు చేసి వర్ణిస్తూ, మధ్య మధ్యలో ఏడుస్తోంది.

"బాధపడకమ్మా. అత్తమామల్ని కన్న తల్లిదండ్రుల్లా చూసుకున్నావు. ఏం చేస్తాం, ఆ మాయదారి దేముడు చూడలేక వాళ్లని లాక్కుపోయాడు" అన్నారు ఇరుగు పొరుగు కొందరు.

"అసలిదెలా జరిగింది వర్ధన్?" ఒక జిజ్ఞాసువు ప్రశ్నించాడు.

"నేను అమ్మని, నాన్నని వెంట పెట్టుకుని విజయ వాడ వెళ్లాను. అక్కడ నా చిన్ననాటి స్నేహితుడు కోటి లింగం కనిపించాడు. వాడి వృత్తి అదేనట! అందరికీ స్నానాలు చేయిస్తున్నాడు. నేను జనాన్ని తోసుకెళ్లలేక అమ్మా, నాన్నల్ని వాడికి అప్పగించాను స్నానాలు చేయించమని. వాడు వాళ్లని తీసుకెళ్లాడు.

కాని.. కాని... వాడు నది ముందర వుండి ఏవో మంత్రాలు చదువుతూ వుంటే అమ్మా నాన్న తొందర పడి అందులో దిగారట. వాళ్లు అందులో మునిగి పోయారట. వాడు ఏడుస్తూ నాకు చెప్పాడు" అంటూ బావురుమన్నాడు వర్ధన్.

"ఊరుకో వర్ధన్" అంటూ ఓదార్చి ఒక్కొక్కరే వెళ్లిపోయారు. ఇలా ఓ నెల రోజులు సాగింది. పలక రింపులు, ఓదార్పులు, పరామర్శలు.

విషాదం కాస్త సద్దుమణిగింది. ఆ ఇంట్లో వింత నిశ్శబ్దం ఆవరించింది.

రోజులు దొర్లుతున్నాయి. ఆ రోజు తల్లిదండ్రుల దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం చదివి చాలా బాధపడింది.

ఈ వయసులో తల్లిదండ్రుల కెలాంటి సమస్య ఎదురయింది. కళ్లలో నీళ్లు సుళ్లు తిరిగాయి.

ఉత్తరంలోని సారాంశం మరోసారి మననం చేసుకుంది గోమతి. "అమ్మాయీ, మీ అన్నయ్య మమ్మల్ని వదిలి దుబాయ్ వెళ్లిపోయాడు. డబ్బు సంపాదించుకుని కొన్నేళ్ల తరువాత తిరిగి వస్తాడట. అప్పటికి మేం బ్రతికుంటామో, లేదో. ఆ మాటే మేం అంటే మీ వదిన గయ్యిమంది. మీ కోసం మేం కట్టుబడి వుండిపోవాలా? మా భవిష్యత్తు మేం చూసుకోవద్దా? ఇటుపై మీ దారి మీది, మా దారి మాది అన్నట్టు మాట్లాడింది. మీ అమ్మకి అనారోగ్యం. ఈ ఊర్లో వైద్య సదుపాయం లేదు. నువ్వు అల్లుడి గారిని ఒప్పిస్తే అక్కడే ఉండిపోవాలని మాకు ఉంది."

"ఆయనగార్ని అడగాలి" అనుకుంది. సాయంత్రం ఎప్పుడవుతుందా? భర్త ఎప్పుడు ఇంటికొస్తాడా? అని ఎదురు చూడసాగింది గోమతి.

సాయంత్రం ఆరు గంటలకొచ్చాడు వర్ధన్ ఆఫీసు నుంచి.

జీడిపప్పు ఉప్మా తెచ్చి అందించింది. వేడి వేడి బ్రూ కాఫీ కలిపి తెచ్చింది.

విచిత్రంగా చూశాడు వర్ధన్.

"ఏమండీ ఒక్క విషయం"

ఏమిటన్నట్లు చూశాడు వర్ధన్.

"పెద్దవాళ్లు వున్నప్పుడు మనం విసుక్కుంటాం. కాని వాళ్లు లేని లోటు తెలుస్తోందిప్పుడు. ఇల్లంతా ఎలా బోసిపోయిందో చూడండి. అత్తయ్యుంటే ఆ పనీ, ఈ పనీ సాయం చేసిపెట్టేవారు. మామయ్యగారు బిల్లులు కడుతుండేవారు. కూరగాయలు తెచ్చిపెట్టేవారు. నిజంగా ఇప్పుడు చెయ్యి విరుచుకున్నట్లుందండీ."

"ఏం చేస్తాం మరి?" అన్నాడు వర్ధన్ చెమ్చాతో ఉప్మా తీసి నోట్లో వేసుకుంటూ.

"వాళ్లు పుణ్యాత్ములు. వెళ్లిపోయారు. ఆ లోటు తీరేది కాదు. అందునా పుష్కరాలలో పోవడమంత అదృష్టం ఇంకొకటి ఉండదు."

"పోయిన వాళ్లు తిరిగి రారు."

"అవును" అన్నాడు వర్ధన్ కాఫీ సిప్ చేస్తూ.

భర్త ముఖంలోకి ఓసారి చూసి "ఏమండీ, ఒక్క మాట" అంది గోమతి.

ఆవేళ వచ్చిన ఉత్తరం గురించి భర్తతో పూసగుచ్చినట్టు చెప్పి, "ఏమండీ ఎలాగూ అత్తయ్యా, మామయ్యా లేరు. మనకి పెద్ద దిక్కంటూ లేకుండా పోయింది. అందుచేత... క్షణకాలం ఆగి అంది గోమతి. మా అమ్మా, నాన్నల్ని ఇక్కడికి తెచ్చుకుందామండీ" అని.

భార్య ముఖంలోకి ఓసారి చూసి మళ్లీ పేపరులోకి తలదూర్చాడు వర్ధన్.

"భర్తని ఎలా ఒప్పించాలా?" అన్న ఆలోచనలో పడింది కొంతసేపు. తరువాత మళ్లీ అంది. "ఏమండీ, ఈ వయసులో మా అమ్మా నాన్నల్ని అలా ఒంటరిగా వదిలెయ్యడం ఏం బావుంటుంది చెప్పండి. మా అన్నయ్యకి బుద్ధిలేకపోతే మనకైనా ఉండొద్దా. వాళ్లు రావడం, రాకపోవడం మీ నిర్ణయం మీద ఆధారపడి ఉంది" ఖాళీకప్పు, ప్లేటు తీసుకుని లోపలికి నడిచింది గోమతి.

ఆమె బుర్రంతా పిచ్చిగా తయారయింది. ఏ పనీ చెయ్యబుద్ధి కావడంలేదు. అనుక్షణం తల్లిదండ్రులే గుర్తొస్తున్నారు. అన్నయ్య వాళ్ల పట్ల ఎంత దారుణంగా ప్రవర్తించాడు. తను పరాధీన. ఏం చెయ్యగలదు.

మరో వారం రోజులు దొర్లాయి.

ఆఫీసు నుంచి ఇంట్లోకొస్తూనే "గోమతీ, మీ అమ్మా, నాన్నగారిని రమ్మని ఉత్తరం రాయి" అన్నాడు వర్ధన్.

గోమతి అంతరంగం ఆనందంతో పొంగిపోయింది. భర్తవైపు కృతజ్ఞతగా చూస్తూ "అలాగేనండీ" అంది.

కోతులాడించేవాడు కోతి చేత చేయించే విన్యాసాలు గుర్తొచ్చాయి వర్ధన్‌కి. 'ఏదీ నీ అత్తింటి కుండతో నీళ్లు పట్రా' అని వాడంటే, కుండనెత్తిన పెట్టుకుని నడుస్తూ దభీమని కుండని ఎత్తేస్తుంది. అదే 'నీ పుట్టింటి కుండతో నీళ్లు పట్రా' అంటే నెమ్మదిగా వయ్యారాలు ఒలకపోస్తూ నడుస్తూ కుండని నేలమీద దించుతుంది. ఆ దృశ్యం కనుల ముందు కదలాడి నవ్వొచ్చింది వర్ధన్‌కి.

"సరే కానున్నవి కాక మానవు, రానున్నవి రాక

## విలోమం!

**మా** ఇంట్లో
మనీ ప్లాంట్
పెరుగుతోంది
అయితే
నా ఆదాయం
తరుగుతోంది!

–తాజీప్రసాద్

మానవు" అనుకుంటూ మౌనంగా వుండిపోయాడు వర్ధన్.

❍ ❍ ❍

ఆ రోజు ఇల్లంతా సందడిగా వుంది. గోమతిలో ఆనందం పొంగి పొర్లుతోంది. 'పిల్లలూ లేండి. ఇవాళ తాతయ్య, అమ్మమ్మా వస్తారు" అంటూ హడావుడి చేస్తోంది.

ఈ హడావుడికి ఇరుగు పొరుగు స్పందించి ప్రశ్నించారు. "గోమతీ ఏమిటిదంతా" అంటూ.

"ఆఁ ఏముంది పిన్నీ! మా నాన్నా, అమ్మా వస్తున్నారు. పెద్దవాళ్లు లేక ఇల్లంతా బోసిపోయింది. అత్తయ్య, మామయ్య గారూ మమ్మల్ని అన్యాయం చేసి పోయారు. అందుకే వీళ్లని రమ్మన్నాం.

"అలాగా!" అంటూ ఎవరి మట్టుకు వాళ్లుండి పోయారు ఇరుగు పొరుగు.

ఎప్పుడు సాయంత్రం అవుతుందా? ఎప్పుడు అమ్మా నాన్నల్ని చూస్తానా? అనుకుంటూ కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరగసాగింది గోమతి.

"వాళ్లు వచ్చేది సాయంత్రం ఏడు గంటలకి. అంత వరకు నువ్వు హాయిగా విశ్రాంతి తీసుకో" అంటూ ఆఫీసుకి వెళ్లిపోయాడు వర్ధన్.

సాయంత్రం ఏడు గంటలయ్యింది. వర్ధన్ ముందు హాల్లో కూచుని టీవీ చూస్తున్నాడు. వీధిలోంచి ఇంట్లోకి, ఇంట్లోంచి వీధిలోకి తిరుగుతోంది గోమతి.

ఇంతలో కరెంటు పోయింది. కొవ్వొత్తి వెలిగించాడు వర్ధన్. ఇంతలో వీధిలో ఆటో ఆగింది.

"అదుగోనండీ అమ్మా, నాన్నా వచ్చారు" అంది గోమతి సంబరంగా.

"వీధిలో దిగినవాళ్లు ఇంట్లోకి రారా ఏమిటి?" అన్నాడు వర్ధన్ సిగరెట్ ముట్టిస్తూ.

వాళ్లు ఆటో దిగి లోపలికొచ్చారు. "అమ్మా, నాన్నా" అనబోయిన గోమతి షాకయింది. స్థాణువులా నిలుచుండి పోయిన కోడల్ని చూస్తూ–

"అమ్మాయీ, బాగున్నావా?" అంటూ లోపలికొచ్చి కూచున్నారు వాళ్లు.

మంచినీళ్లు తెచ్చి అత్తమామలకందిస్తూ, అత్తయ్యా, మామయ్యా..., మీ..రు.. మీ..రు..?"

"మాకేమయ్యిందమ్మా. హాయిగా ఉన్నాం."

"బాబూ వర్ధన్. నీ చిన్ననాటి స్నేహితుడు కోటిలింగం ఆ చుట్టుపక్కల ఉన్న దేవాలయాలన్నీ తిప్పి చూపించాడు. మాకు ఇంకే కోరికలూ లేవు" అన్నారు వాళ్లిద్దరూ.

భర్తవైపు చూసింది గోమతి.

వర్ధన్ పెదాలపై చిరు దరహాసం వెలుగుతోంది.

ఇందులో ఏదో కిటుకుంది. భర్త తనని మోసగించాడు. అనుకుంటూ వీధివైపు తిరిగింది గోమతి.

ఇంతలో వీధిలో ఇంకో ఆటో ఆగిన శబ్దం అయింది. అంతా అటువైపు చూశారు.

గోమతి తల్లిదండ్రులిద్దరూ ఆటో దిగి వస్తున్నారు.

"రండి అత్తయ్య, మామయ్యగారూ" వర్ధన్ వాళ్లని సాదరంగా ఆహ్వానించాడు.

"ఇవాళ బండి రెండు గంటలు లేటు" అంటూ లోపలికి లగేజీని చేరవేస్తూ, చెంచమ్మ గార్ని, వైకుంఠ మూర్తిగార్ని చూస్తూ, "మీ..రు.. మీ..రు..?" అంటూ ఆశ్చర్యంగా చూశారు.

"మేము కృష్ణా పుష్కర స్నానాలు ముగించుకుని ఆ చుట్టుపక్కల దేవాలయాలన్నీ దర్శించుకుని, మా దూరపు బంధువుల ఇళ్లకి వెళ్లి తిరిగి వచ్చాం. అస్తమానం తిరగలేము కదా. అందుకే ఇన్నాళ్లు వుండిపోయేము. ఎప్పుడో నా పేర వేసిన ఫిక్సడ్ డిపాజిట్ డబ్బు వచ్చింది. దాన్ని మాకిచ్చి వర్ధన్ మమ్మల్ని పంపించాడు" అన్నారు చెంచమ్మ, వైకుంఠమూర్తి.

అప్పటికే సినిమా చూస్తున్నట్లు చూస్తున్నారు ఇరుగు పొరుగు.

వాళ్లకి చేతులు జోడించి అన్నాడు, "నన్ను క్షమించండి. మా అమ్మా నాన్నలు మరణించారని మిమ్మల్ని నమ్మించాను. ఇది మా కుటుంబ వ్యవహారం. మీరంతా దయచేసి వెళ్లండి" అని.

వాళ్లు వెళ్లిపోయారు.

చిత్తరువులా ఇదంతా చూస్తూ నిలబడిన గోమతితో అన్నాడు. "గోమతీ, వీళ్లు మా అమ్మా నాన్నలు. వాళ్లు మీ అమ్మా నాన్నలు. నీ, నా అనే తేడాలు మన మధ్య వుండకూడదా? నీ, నా అనే కంటే మన అనుకుంటేనే ఆనందం ఉంది. అందుచేత ఇటుపై అలాంటి తేడాలు లేకుండా అందరం కలిసే ఉందాం. మీ అన్నయ్య దుబాయి నుంచి వచ్చేవరకు మీ అమ్మా నాన్నలు మనతోనే కలిసి ఉంటారు. సరేనా?"

చిన్నగా నవ్వింది గోమతి.

చూడు గోమతీ, మీ అమ్మా నాన్న, మా అమ్మా నాన్న వెరసి మన అమ్మా నాన్నలు" అంటూ నవ్వాడు వర్ధన్.

ఆ ఇంట్లో నవ్వుల పువ్వులు విరిశాయి. ■